26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ఏలూరు అర్బన్:మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్)కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనమివ్వాలని, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందికి రిస్క్ అలవెన్స్, హెల్త్ అలవెన్స్‌లు అమలు చేయాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల 26వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు మున్సిపల్ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు సమ్మె నోటీసును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ 2019 ఎన్నికలకు ముందు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనమిస్తామని చెప్పారన్నారు. కానీ ఐదేళ్లు గడుస్తున్నప్పటికీ హామీని అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, నగర అధ్యక్షులు లావేటి కృష్ణారావు, నగర నాయకులు బంగారు వెంకటేశ్వరరావు, పి.చిన్ననాగరాజు, తానంకి జార్జి, ఎం.గోపి, అల్లం హనుమంతరావు నాయకత్వం వహించారు.

ఎన్నికల 'ఆట'..!



అధికారపార్టీలో పలువురు సిట్టింగ్ ఎంఎల్‌ఎలకు షాక్

రెండు జిల్లాల్లో ఐదుగురు ఎంఎల్‌ఎలకు టిక్కెట్ హుళక్కేనా

'పోలవరం' బాలరాజుకు లేదని స్పష్టం చేసినట్లు సమాచారం

చింతలపూడి, ఆచంట, ఉంగుటూరు నియోజకవర్గాల్లో మార్పులు

నరసాపురం ఎంఎల్‌ఎ టిక్కెట్‌పైనా కొనసాగుతున్న ఉత్కంఠ

పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జికీ అవకాశం అనుమానమే

టిడిపిలోనూ టిక్కెట్లపై వీడని ఉత్కంఠ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల ఆట మొదలైంది. రెండు జిల్లాల్లోనూ అధికార పార్టీ ఎంఎల్‌ఎల్లో టిక్కెట్ టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఉంటుందో.. లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే రెండు జిల్లాల్లో ఐదు నియోజకవర్గాల్లో మార్పులు తప్పవని వైసిపి అధిష్టానం చెప్పకనే చెప్పింది. దీంతో టిక్కెట్ కోసం సిఎం వద్దకు ఎంఎల్‌ఎలు క్యూ కడుతున్నారు. తమకున్న పలుకుబడిని ఉపయోగించి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం పావులు కదుపుతున్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలకుగాను 13 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను వైసిపి గెలుచుకుంది. జిల్లాల విభజన తర్వాత ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, పశ్చిగోదావరి జిల్లాలో ఏడు స్థానాలు, మొత్తం 14 అసెంబ్లీ స్థానాలు, రెండు ఎంపీస్థానాలు ఉన్నాయి. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న సిట్టింగ్ ఎంఎల్‌ఎలను మార్చి కొత్తవారిని బరిలోకి దింపాలని వైసిపి ప్రణాళికలు రచించింది. అందుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించి టిక్కెట్ల మార్పులపై వైసిపి అధిష్టానం స్పష్టంగా ఉన్నట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు ఇప్పటికే టిక్కెట్ లేదని స్పష్టంగా తెలియచేసినట్లు తెలిసింది. అంతేకాకుండా సమర్ధుడైన వ్యక్తి పేరును సూచించాలని బాలరాజునే కోరినట్లు సమాచారం. దీంతో తన భార్యకు టిక్కెట్ ఇవ్వాలని బాలరాజు అడిగినట్లు ప్రచారం సాగుతోంది. దీంతో పోలవరం సిట్టింగ్ ఎంఎల్‌ఎకు టిక్కెట్ లేదని స్పష్టంగా అధిష్టానం తేల్చేసినట్లే. ఇక చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాకు ఎంఎల్‌ఎ టిక్కెట్ లేదని చెప్పినట్లు సమాచారం. అమలాపురం ఎంపీగా పోటీ చేయాలని మొదట పేర్కొన్నట్లు ప్రచారం సాగింది. అమలాపురం ఎంపీ టిక్కెట్ పినిపె విశ్వరూప్‌కు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఎలిజా పరిస్థితి ఏమిటో తెలియకుండాపోయింది. చింతలపూడి నుంచి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును బరిలోకి దింపే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే సమయంలో రవాణాశాఖలో పని చేస్తున్న అధికారికి అవకాశం దక్కనున్నట్లు చెబుతున్నారు. రెండు, మూడు రోజుల్లో చింతలపూడి నియోజకవర్గం నుంచి ఎవరు పోటీ చేస్తారో తేలిపోనుంది. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబుకు టిక్కెట్ లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు ప్రచారం సాగుతోంది. ఇక్కడ నుంచి బిసి అభ్యర్థిని పోటీకి దింపాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అభ్యర్థి నిర్ణయంపై మాత్రం ఇంకా అధిష్టానం ఒక నిర్ణయానికి రాలేదని తెలుస్తోంది. కైకలూరు టిక్కెట్ మార్పుపై ప్రచారం సాగినా మార్పు ఉండదని చెబుతున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లాల్లో మాజీ మంత్రి చెరుకువాడ రంగనాథరాజుకు టిక్కెట్ లేదని ఇప్పటికే స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆయన్ని ఏవిధంగా పార్టీ ఉపయోగించుకుంటుందో ఇంకా స్పష్టత రాలేదని చెబుతున్నారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న గుడాల గోపికి కాకుండా వేరొకరికి టిక్కెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానం యోచిస్తున్నట్లు తెలిసింది. నరసాపురం ఎంఎల్‌ఎ ప్రసాదరాజును మారుస్తారని ప్రచారం సాగినప్పటికీ స్పష్టమైన సంకేతాలు ఇంకా వెలువడలేదు. రెండు జిల్లాల్లో ఐదుస్థానాల్లో మార్పులు జరగనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై వైసిపి నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉందని నేతలు చెబుతున్నారు. ఎంపీ స్థానాల్లో బరిలోకి దింపే అభ్యర్థులకు సంబంధించి తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలిసింది. ఏలూరు ఎంపీగా కోటగిరి శ్రీధర్ మరోసారి బరిలోకి దిగేందుకు సుముఖంగా లేనట్లు ప్రచారం సాగుతోంది. అదే సమయంలో నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణంరాజు ఇప్పటికే పార్టీ వ్యతిరేకిగా ఉండటంతో అక్కడ ఎవరిని బరిలోకి దింపాలనే దానిపై అధిష్టానం మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది.

టిడిపిలోనూ టిక్కెట్లపై వీడని ఉత్కంఠ

ప్రతిపక్ష పార్టీ టిడిపిలోనూ ఎంఎల్‌ఎ టిక్కెట్ల కేటాయింపులపై ఉత్కంఠ కొనసాగుతోంది. టిడిపి, జనసేన పొత్తులో టిక్కెట్ల కేటాయింపు ఏవిధంగా ఉంటుందోననే టెన్షన్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జుల్లో నెలకొంది. జనసేనకు ఎన్ని సీట్లు కేటాయిస్తారోననే చర్చ కొనసాగుతోంది. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాలను జనసేనకు కేటాయించే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. అదే జరిగితే టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఉంగుటూరు మాజీ ఎంఎల్‌ఎ గన్ని వీరాంజనేయులుకు ఎక్కడ టిక్కెట్ కేటాయిస్తారో తేల్చాల్సి ఉంటుంది. ఇంకా ఎస్‌సి నియోజకవర్గం చింతలపూడి, ఎస్‌టి నియోజకవర్గం పోలవరం స్థానాలు ఎవరికి కేటాయిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ స్థానాలకు ఆశావహులు ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆయా పార్టీల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, ఆశావహుల్లో తీవ్ర టెన్షన్ నెలకొంది.

సమస్యలు పరిష్కరించాలని మెడికల్ రిప్స్ ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మెడికల్ రిప్స్ ఒక్కరోజు సమ్మెలో భాగంగా మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యాన ఏలూరులో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పవర్‌పేటలోని రైల్వే స్టేషన్ నుండి ఆర్ఆర్ పేట విజయవిహార్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎన్.ప్రసాద్, సిఐటియు నాయకులు పి.కిషోర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మందులపై జిఎస్‌టి విధించి ధరలు పెంచిందన్నారు. ప్రభుత్వం తక్షణమే మందులు, వైద్య పరికరాలు, వ్యాక్సిన్లపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ రిప్స్ సమ్మె ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా డిమాండ్స్ ఉన్నాయని పేర్కొన్నారు. మెడికల్ రిప్స్ వ్యక్తిగత డేటా గోప్యతను కేంద్ర ప్రభుత్వం కాపాడాలి డిమాండ్ చేశారు. 1976 మెడికల్ రిప్స్ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. పనిగంటలు, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కళాశాలల్లో విధులు నిర్వహించుకోవడానికి మెడికల్ రిప్స్‌కు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు వివి.సత్యనారాయణ, కార్యదర్శి సిహెచ్.సీతయ్య, ఆంథోనీడిసౌజ, ఉమామహేశ్వర రావు, దుర్గారావు, మొహిద్దీన్, చెన్నకేశవరావు, సోమేశ్వరరావు, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న మెడికల్ రిప్స్

చింతలపూడి:సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వేతనాలు పెంచి ఇతర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ఉద్యోగులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎం.వెంకటేశ్వరరావు, డి.సత్యవాణి, నిర్మలకుమారి, నాగమణి, రామలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే త్వరలో సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఇప్పటికే పెన్‌డౌన్ వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

పంటకాలువలో ఆర్‌టిసి బస్సు బోల్తా

ఇద్దరు మృతి - ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి - మండవల్లి/కైకలూరు

ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆ పక్కనే ఉన్న పంటకాలువలో బోల్తాపడిన ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కాకతీయ నగర్ వద్ద బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బస్సులోని ప్రయాణికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు సుమారు 65 మంది ప్రయాణికులతో సాయంత్రం ఏలూరు నుంచి నరసాపురానికి ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌గా బయలుదేరింది. కైకలూరు శివారులో మండవల్లి మండలం కాకతీయనగర్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ క్రమంలో బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పంటకాలువలో బోల్తాపడింది. ఈ సంఘటనలో కాకతీయనగర్‌కు చెందిన మోటార్‌సైకిలిస్ట కేతా అర్జున్‌రావు(60) అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు చక్రాలకింద నలిగి అర్జున్‌రావు మృతదేహం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బిగ్గరగా కేకలువేస్తూ వణికిపోయారు. ఈ క్రమంలో బస్సులోఉన్న భైరవపట్నానికి చెందిన చింతాడ శ్రీదేవి(45) ఊపిరాడక మృతిచెందింది. ఆమె ఏలూరు నుంచి కైకలూరు వరకూ టిక్కెట్ తీసుకున్నట్లు గుర్తించారు. ప్రాణభయంతో బస్సు అద్దాలను పగలగొట్టుకుని బయటకు వచ్చారు.

అర్జున్‌రావు మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న పోలీసులు

గాయపడినవారిలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన బాణాల సత్యవతి(40), పాలకొల్లుకు చెందిన గుప్పుల హారిక(35), బండి అన్నపూర్ణ(67), నరసాపురానికి చెందిన గుడియాల శ్రీను(30), నరసాపురానికి చెందిన గుడియాల స్వాతి(28), కైకలూరుకు చెందిన నక్క రజని(14) ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌సాయంతో బస్సును బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాధితులను కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరావు, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకుని పరామర్శించారు. క్షతగాత్రులను వారిసొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలించారు.

రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

ఏలూరు : మృతుల కుటుంబాలకు సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటన విడుదల చేశారు మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

మర్లగూడెం పేదల భూ సమస్యను పరిష్కరిస్తాం

ఐటిడిఎ పిఒ సూర్యతేజ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఫలించిన గిరిజనుల పది రోజుల దీక్షలు

బుట్టాయగూడెం:మర్లగూడెంలోని భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు పది రోజులుగా చేస్తున్న దీక్షలకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిపై ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి ఐటిడిఎ పిఒ సూర్యతేజ స్పందించి సిపిఎం నాయకత్వంతో సమస్యలపై చర్చించి తన పరిధిలో ఉన్న విషయాలపై వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మర్లగూడెం గిరిజన రైతులు నిరాహార దీక్షలను విరమించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ మర్లగూడెంలోని 1/70 చట్టం భూములను గత 30 సంవత్సరాల నుంచి స్థానిక గిరిజనులు సాగు చేస్తున్నారని, కోర్టు విషయం గురించి పిఒ మాట్లాడటం జరిగింది. ఎల్‌టి ఆర్ భూముల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారం విషయంపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భూమిని చదును చేసి పంట భూమిగా మారుస్తామని తెలిపారు. ఐటిడిఎ పిఒ కోర్టులో ఉన్న కేసులను సత్వరం పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడుతావ్ అని కూడా హామీ ఇవ్వడం జరిగిందిఅన్నారు. అనంతరం దీక్ష శిబిరంలో కూర్చున్న గిరిజనులకు నిమ్మరసం అందించి దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరావు, పి.దుర్గారావు, మడకం వెంకటేశ్వర శ్రీదేవి, రోజా ఉన్నారు.

26 నుంచి 'ఆడుదాం..ఆంధ్రా'కు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు: జిల్లాలో ఈనెల 26 నుంచి నిర్వహించే ఆడుదాం.. ఆంధ్రా టోర్నమెంట్ నిర్వహణకు పూర్తిస్థాయిలో సన్నద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమంపై సిఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట, డిఇఒ శ్యామ్‌సుందర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మలజ్యోతి పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ పోటీల నిమిత్తం ఇప్పటి వరకూ 1,42,347 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. వీరిలో 88,029 మంది పురుషులు, 54,318 మంది మహిళలు ఉన్నారన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 318 ఆట స్థలాలను గుర్తించామని, వాటిలో 114 క్రికెట్ కోసం గుర్తించబడ్డాయన్నారు. మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో అంబాసిడర్లను కూడా ఎంపిక చేశామన్నారు. ఆయా క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లను కూడా ఇప్పటికే ఆయా కేంద్రాలకు పంపిణీ చేశామని తెలిపారు.

11 మందికి విదేశీ విద్యాదీవెన లబ్ధి : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కింద 13 మంది విద్యార్థులకు రూ.86.93 లక్షల ఆర్థిక ప్రయోజనం చేకూరిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో సిఎం జగన్ జమచేశారు. ఏలూరు కలెక్టరేట్‌లోపి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి, సాంఘీక సంక్షేమ శాఖ జెడి జయప్రకాష్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, నగరపాలకసంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిఎంహెచ్ఒ శర్మిష్ట, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఎస్.నిర్మలజ్యోతి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డెమో చెక్కును కలెక్టర్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విదేశీ విద్యాదీవెన కింద 11 మంది విద్యార్థులకు రూ.84,93,077 ఆర్థిక సహాయాన్ని అందించగా జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహం కింద రూ.రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు.

22న ముదినేపల్లిలో స్పందన

ముదినేపల్లి:ప్రతిబుధ, శుక్రవారాల్లో మండలస్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 22న ముదినేపల్లిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 'వి' కన్వెన్షన్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం పది గంటల నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమంలో మండల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులు బుధవారం నుండి నిరవధిక సమ్మెను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయకుండా నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీస వేతన జిఒలు విడుదల చేయడం తప్ప అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పోస్టులకు ఖచ్చితమైన జాబ్‌ఛార్ట్ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. సమ్మెకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆలీ, కార్యదర్శి ఆర్.రవికుమార్, కోశాధికారి జివి.రంగమోహన్, నరసింహారావు, సమగ్ర శిక్ష యూనియన్ నాయకులు రాజు, దిలీప్, బాలాజీ, సత్య, చినబాబు, వై.శ్రీనివాసరావు, వీరమణి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

అంగన్‌వాడీల వంటావార్పు

తొమ్మిదో రోజుకు సమ్మె

జీలుగుమిల్లిలో గడ్డితింటూ, ముసునూరులో భిక్షాటన చేసి నిరసన

పలుచోట్ల సెంటర్ల తాళాలు బద్దలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద వంటా వార్పు నిర్వహించి వినూత్నంగా నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో వంట చేసుకుని అక్కడే భోజనాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే సిఎం జగన్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వారి సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం సెంటర్ల తాళాలు, తలుపులు బద్దలు కొడుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఏడాది కాలంగా పోరాడుతున్నా జగన్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రజనీ, హైమావతి, స్వప్న, నవతి, కనకదుర్గ, సోములమ్మ, నిర్మల, జయసుధ, ఈశ్వరమ్మ, కె.భార్గవి, అంథోని పాల్గొన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సుభాషిణి, పివి.నరసింహారావు, ఐలు నాయకులు సంఘీభావం తెలిపారు.



జీలుగుమిల్లిలో గడ్డి తింటూ నిరసన

ముసునూరులో భిక్షాటన చేసి నిరసన

ఏలూరులో పలు సెంటర్ల తాళాలు బద్దలు

ఏలూరు నగరంలో అనేక వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ ఉద్యోగులు బుధవారం పగలగొట్టారు. అయితే ఎక్కడికక్కడ అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. అద్దె ఇళ్లలో నడుస్తున్న సెంటర్ల యజమానులు అభ్యంతరం తెలిపారు. సుందరయ్య కాలనీలో సెంటర్ తాళాలు బద్దలు కొట్టడానికి వచ్చిన సిబ్బందిని లబ్ధిదారులు ఆ కాలనీ ప్రజలు అడ్డుకొని వెనక్కి పంపించారు.

జీలుగుమిల్లి : అంగన్‌వాడీలు సమెలో భాగంగా తొమ్మిదో రోజు వినూత్నంగా నిరసన తెలిపారు. పచ్చగడ్డి తింటూ తమ నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సిఐటియు, వెలుగు ఉద్యోగుల సంఘం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు తమ సమస్యలు పరిష్కరించకుండా అంగన్‌వాడీలను బెదిరించడం ప్రభుత్వానికి తగదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు విజయలక్ష్మి, శ్యామల, మాణిక్యం, కార్యదర్శి కొండలరావు, అంగన్‌వాడీలు నాగమణి, ఎస్తేరు, జ్యోత్స్న, పూర్ణ పాల్గొన్నారు.

పెదపాడు:అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేయాలనే ప్రయత్నాలను విరమించుకుని సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. పెదపాడులోని బస్టాండ్ సెంటర్‌లో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సమ్మెకు రైతు సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, సిఐటియు మండల కార్యదర్శి రెడ్డి లక్ష్మణరావు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ పెదపాడు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎస్.తిరుపతమ్మ, కె.శారద, ఎ.దేవమణి, సీతామహాలక్ష్మి, దుర్గ, జ్యోతి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్:స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.ఆనందరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ఆర్.హనుమాన్లు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, వసుంధర, పద్మజ్యోతి, విజయలక్ష్మి, ఎఐటియుసి నాయకులు పుల్లారావు, దుర్గ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : మండలంలో అంగన్‌వాడీల సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలు రోజుకోరకంగా నిరసన నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అంగన్‌వాడీలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి, మతాశిశు మరణాలను తగ్గించడానికి ఎంతగానో కృషి చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు పి.సుజాత, ప్రధాన కార్యదర్శి పి.భారతి, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేని, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.మంగ, శ్రీదేవి, నుర్జహాన్ పాల్గొన్నారు.

చాట్రాయి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీల నిరవధిక సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు పల్లె రాజకుమారి పాల్గొన్నారు.

టి.నరసాపురం : అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించేవరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్‌వాడీలు తొమ్మిదో రోజు సమ్మెలో భాగంగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు సందర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నాయకులు స్వర్ణకుమారి, చెల్లామణి పాల్గొన్నారు.

చింతలపూడి : అంగన్‌వాడీల తొమ్మిదో రోజు సమ్మెలో భాగంగా వంటావార్పు నిర్వహించారు. ఈ సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విస్సంపల్లి సుందర్‌రావు అంగన్‌వాడీలకు పసుపు, కుంకుమ ఇచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ ఇస్తానని చెప్పిన సిఎం నేడు మాట తప్పారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంలో అంగన్‌వాడీలకు రూ.18 వేలు ఇస్తున్నారని, కానీ ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అధ్యక్షులు గంధం అంజమ్మ, సిఐటియు నాయకులు సరోజనీ, అంగన్‌వాడీలు అరుణ, కవిత, సరళ, మరియమ్మ, విజయలక్ష్మి, సిఐటియు నాయకులు నత్త వెంకటేశ్వరరావు, నారాయణ, సత్యనారాయణ, బాలరాజు, జప్రుల్లా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించలేని ప్రభుత్వం వారి సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కలెక్టర్ల ద్వారా ఆదేశాలు జారీ చేసి సచివాలయ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు పగలగొట్టడం అప్రజాస్వామికమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్, పి.మంగరాజు తెలిపారు. మండలంలోని రెడ్డిగణపవరం సచివాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా గ్రామంలోని తల్లులు తమ పిల్లలతో ఆందోళన చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా సచివాలయ ఉద్యోగులు కేంద్రాల తాళాలు తెరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు మాట్లాడారు.

ముసునూరు : అంగన్‌వాడీలు ముసునూరులో నూజివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి పల్లి పాము రాజకుమారి ఆధ్వర్యంలో భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావతి, శిరీష, దుర్గ, లక్ష్మి, మేరీ సులోచన, రాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు శిబిరం వద్ద వంటావార్పు చేసి నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిఐటియు మండల అధ్యక్షులు షేక్ అబీదాబేగం, ఉపాధ్యక్షులు చిన్నం శ్రీకాంత్, అంగన్‌వాడీల యూనియన్ నాయకులు జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ సిబ్బంది పగులకొట్టారు. దీంతో అంగన్‌వాడీలు పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలిపి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి, సిఐటియు మండల అధ్యక్షులు పుష్ప, అంగన్‌వాడీ ప్రాజెక్టు నాయకులు కృపామణి, రామలక్ష్మి, నూర్జహాన్, ఆకాశమ్మ పాల్గొన్నారు.

నిడమర్రు : అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి నాయకులు పోసింసెట్టి రామ్మూర్తి మద్దతు తెలిపారు. తొమ్మిదో రోజు సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రమణరావు, ఎన్.పార్వతి. జయమ్మ, ఆర్ రామలక్ష్మి, కె.సుభాషిణి, కుమారి, నాగమణి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

పోలవరం : అంగన్‌వాడీల సమ్మెకు జనసేన మండల అధ్యక్షులు గునపర్తి వెంకట సత్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు సంఘీభావం తెలిపారు. తొమ్మిదో రోజు సమ్మెలో తెలగంశెట్టి రాము, కురసం రమేష్, వనిమిరెడ్డి సీతయ్య, కొక్కెర సత్తిబాబు, ఎ.రాధయ్య, మామిడిపల్లి స్వాతి, మామిడిపల్లి ప్రసాద్, టి.నరసింహమూర్తి, కె.సురేష్, కిషోర్, పి.శ్రీను, పల్లపు స్వామి, నాగేంద్ర, రామకృష్ణ, రాంబాబు, రాంబాబు, పిఎల్ఎస్.కుమారి పాల్గొన్నారు.

కైకలూరు : అంగన్‌వాడీలు వంటావార్పుతో నిరసన తెలిపారు. స్థానిక తాలూకా సెంటర్‌లో చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ సందర్శించ మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు కురేళ్ల లాజరు, టిడిపి, జనసేన నాయకులు తాడినాడ బాబు, జానీ, రత్నారావు, గంగుల శ్రీదేవి, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ పాల్గొన్నారు.

ముదినేపల్లి : సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీ కేంద్రాల పిల్లల బాధ్యత ప్రభుత్వానిదే

జంగారెడ్డిగూడెం : అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఏదైనా ప్రమాదాలు జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ హెచ్చరించారు. డివిజన్ ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ సమావేశం గణేష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రమణ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే సమస్యలు పరిష్కరించకుండా, సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులతో కేంద్రాల తాళాలు పగులకొట్టించడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ బాలిన ధర్మరాజు, ఉపాధ్యక్షులు ఎరుబండి వీర్రాజు పాల్గొన్నారు

భీమడోలు : రిలే దీక్షల్లో న్యాయవాదులు

కొనసాగిన న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - భీమడోలు

ఎపి భూ హక్కుల యాజమాన్య చట్టం రద్దు చేయాలని కోరుతూ భీమడోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంతో రెండో రోజుకు చేరాయి. భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో కాలి గంగరాజు, ఓగిరాల ప్రసాద్ రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కాలి నాగేశ్వరరావు, గంగరాజు ప్రసంగించారు.

నూజివీడు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక భూ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నూజివీడులో బుధవారం న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేశారు. నూతనంగా తీసుకొచ్చిన ఎపి భూ హక్కు చట్టం 2022ను రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, ప్రజల హక్కులను కాలరాచే చట్టాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు సత్యప్రకాష్, భారత్ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, ఆర్‌వి.సత్యనారాయణ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

నూజివీడు రూరల్ : వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులకు రూ.25 లక్షల వరకు వైద్య సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పట్టణంలోని మూడు, నాలుగు వార్డుల లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి సిఎం జగన్ పాటు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన మెగా ఆరోగ్యశ్రీ ద్వార లబ్ధిదారుల కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మెగా ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమం కమిషనర్‌కి భవానీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా పలువురికి ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెన అచ్యుతరామయ్య, వైసిపి నాయకులు బత్తిన చిన్న పాల్గొన్నారు.

అనుమతి లేని లేఅవుట్లతో జాగ్రత్త

నూజివీడు రూరల్ : నూజివీడు పట్టణ ప్రాంతంలో అనుమతి లేని లేఅవుట్లపై ఎపి సిఆర్‌డిఎ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ బుధవారం మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకుండా లేఅవుట్లు వేయడం నేరం అన్నారు. అలాంటి లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారని హెచ్చరించారు. అనుమతి లేని లేఅవుట్లను అధికారుల బృందం పర్యవేక్షణలో తొలగిస్తున్నట్లు తెలిపారు.

ఎంఎల్ఎకు వినతిని అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఎరియర్స్ బకాయిలు విడుదల చేయాలని, ఎపిజిఎల్ఐ పిఎఫ్ లోన్లు పెట్టుకున్న వారికి నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు కూడా విడుదల చేయాలని కోరుతూ బుధవారం ఎంఎల్ఎ ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్‌కి యుటిఎఫ్ నాయకులు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి ఇ.శివశంకరరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ బి.మోహన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ పివి.నరసింహారావు, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, కోశాధికారి కె.కిరణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు పాల్గొన్నారు.

మేట్ల శిక్షణ పూర్తి : ఎపిఒ వెంకటేశ్వరరావు

పోలవరం : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మేట్లకు బుధవారంతో రెండు రోజుల శిక్షణ పూర్తయినట్లు పోలవరం ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం శిక్షణా కార్యక్రమంలో మేట్లకు పని ఏవిధంగా చేయించాలి, ప్రతి వ్యక్తి రూ.272 వేతనం పొందాలంటే ఎంత పని చేయాలి వంటి అంశాలు తెలియజేశారు. మేట్లు మరింత మెరుగ్గా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వెంకటేశ్వరరావు, జెఇ లీలా భరత్, టిఎలు సిహెచ్.వరప్రసాద్, జి.మురళీ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యం

తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తిరుమలదేవి పేటలో బుధవారం నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయోత్సవాన్ని పురస్కరించుకొని టిడిపి, జనసేన నాయకులతో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ 226 రోజుల్లో 97 నియోజకవర్గాల మీదుగా 2,200 గ్రామాల్లో 3,132 కిమీ యువగళం పాదయాత్ర చేసి ప్రజల సమస్యలు తెలుసుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో తోట నాయుడు, తోట పండు, తోట సత్యనారాయణ, జట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజలు ఐకమత్యంగా ఉండాలి

కైకలూరు : గ్రామాల్లోని ప్రజలు ఐక్యమత్యంగా కలిసి మెలసి ఉండాలని వెలి వేయడాలు, గ్రామ బహిష్కరణలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా పంచాయతీ అధికారి టి.శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. బుధవారం మండలంలోని శృంగవరప్పాడులో గ్రామ సర్పంచి, మాజీ సర్పంచి కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంపై పలు రకాల ప్రచార మాధ్యమాల్లో వచ్చిన కథనాలపై ఆయన కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. స్థానిక కమ్యూనిటీ భవనంలో గ్రామ పెద్దలు, ఇరు వర్గాల వారితో అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు అందరికి సమానం అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

గుర్తుతెలియని మహిళను రైలు బండి ఢీకొని మృతి చెందిన ఘటన ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఏలూరు నగరంలోని పెద్ద రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 40-45 ఏళ్ల వయసు కలిగిన మహిళను గుర్తుతెలియని రైలు బండి ఢీకొంది. ఈ ఘటనలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అయితే మృతి చెందిన మహిళ ఐదు అంగుళాల ఎత్తు కలిగి నలుపు, తెలుపు జుట్టు కలిగి ఉంది. గంధం, ఆకుపచ్చ రంగు కలిగిన చీర, గంధం రంగు జాకెట్టు ధరించి ఉంది. వివరాలు తెలిసినవారు రైల్వే ఎస్ఐ నరసింహారావును సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలియజేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రి మార్చురికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సైన్సు పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి : ఎంఇఒ కళ్యాణి

ప్రజాశక్తి - టి.నరసాపురం

బాల్యం నుంచే విద్యార్థులు సైన్సు పట్ల ఆసక్తి పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారిణి-2 ఎస్.కళ్యాణి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళ్యాణి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో దోహద పడుతుందన్నారు. జీవితంలో ప్రతి విషయం సైన్సుతో ముడిపడి వుంటుందని ఆమె తెలిపారు. సైన్సు మానవాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. విజ్ఞాన ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన టి.నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అప్పలరాజు గూడెం గురుకుల పాఠశాల, వీరభద్రవరం యుపి స్కూల్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విజి.కృష్ణారావు, కె.కుటుంబరావు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎంఎల్ఎ

జీలుగుమిల్లి : విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం బర్రింకలపాడు గురుకుల పాఠశాల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్-17 జోనల్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. పలు రకాల క్రీడా పోటీలకు జోన్-2 పరిధిలోని 17 గిరిజన గురుకులాల నుంచి 450 మంది క్రీడాకారుల వరకు పాల్గొన్నారని ప్రిన్సిపల్ బి.పెద్దిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు కూడా విద్యార్థి మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ, జెడ్‌పిటిసి వసంతరావు, వైస్ ఎంపిపి ఎస్.శ్రీనివాస్, ఎంపిటిసి సురేష్ పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులుగా సురేష్ కుమార్

ఆగిరిపల్లి : జిల్లా పంచాయతీ రాజ్ విభాగం ఉపాధ్యక్షులుగా ఆగిరిపల్లి మండలం, కలటూరు గ్రామ సర్పంచి రాఘవరపు సురేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎంఎల్ఎ వెంకట ప్రతాప్ అప్పారావుకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి మండల వైసిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.


ఎంఎల్ఎతో సురేష్‌కుమార్

వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా సాయిబాల పద్మ

జంగారెడ్డిగూడెం : వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన వందనపు సాయి బాల పద్మ మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆమె వివరాలను వెల్లడించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సాయిబాల పద్మ వైసిపిలో చురుకైన పాత్ర వహించడానికి గుర్తించి ఏలూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పదవిని కేటాయించడం జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్ మహిళా శిశ సంక్షేమ శాఖ రీజియన్ ఛైర్‌పర్సన్‌గా నామినేటెడ్ పదవిని ఆమె దక్కించుకున్నారు. గతంలో ఆమె వాసవీక్లబ్ అధ్యక్షురాలిగా, పట్టణ ఆర్యవైశ్య సంఘ మహిళా అధ్యక్షురాలిగా, గోకుల తిరుమల పారిజాత గిరికి రెండుసార్లు ధర్మకర్తల మండలి అధ్యక్షురాలి పదవులు చేపట్టి సమర్థవంతంగా నిర్వచించారని తెలిపారు. వైసిపి ఏలూరు పార్లమెంటు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా పదవిని మరొకసారి అలంకరించడం పట్ల పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు, రాజకీయ ప్రముఖులు శుభాకంక్షలు తెలియజేశారు.


జగన్‌తో సాయిబాల పద్మ

వైసిపి జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీగా శ్యాం కుమార్

పోలవరం : వైసిపి జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీగా పొడుం శ్యాం కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా తనకు జిల్లా యూత్ జాయింట్ సెక్రెటరీగా బాధ్యతలు అప్పగించిన పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు, పార్టీ అధిష్టానానికి ఆయన బుధవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ పార్టీకి విధేయుడునై నాయకులు అందరితో కలిసి కష్టపడి పని చేస్తానని తెలిపారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

జంగారెడ్డిగూడెం : స్థానిక 11వ వార్డు మారుతీనగర్‌లో రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తెలిపారు. బుధవారం మారుతీ నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ ముప్పిడి అంజి, స్థానిక కౌన్సిలర్ ఉగ్గాం దుర్గాప్రసాద్, కౌన్సిలర్ నేకూరి కిషోర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రేమతత్వమే క్రీస్తు సందేశం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : జీవితంలో ఏసందర్భంలోనైనా తీసుకున్న విషయం విడవకుండా విశ్వాసంతో ముందుకు వెళితే.. వారివెంట దేవుడు అండగా ఉంటాడని, బైబిల్ కూడా అదే బోధిస్తోందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. సెమి క్రిస్టమస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి ఎన్ఎస్.కృపవరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, డిఇఒ శ్యాం సుందర్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు.

ఇడా ఛైర్మన్‌గా బొద్దాని ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా అధ్యక్షులు ఎంఎల్ఎ ఆళ్ల నాని ఆశీస్సులతో ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్(ఇడా)గా నగర వైసిపి అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్‌కి ఎంపిక పట్ల పలువురు నగర ప్రముఖులు కలిసి అభినందనలు తెలిపారు. ఏళ్లగా పార్టీని నమ్ముకుని, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న బొద్దానికి పదవి ఇవ్వడం సంతోషదాయకమన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 13 మంది తల సేమియా చిన్నారులకు రక్తమార్పిడి నిర్వహించినట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా వ్యాధి చిన్నారులకు రక్తమార్పిడి రోజున ప్రతి చర్యలు సంభవించకుండా ఉపయోగించే ఫిల్టర్ సెట్స్‌కి దాతల సహకారం కావాలని కోరారు. బుధవారం తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు 35 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దంపతులు పివిపిన్, తేజస్విల దంపతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, మానవత సభ్యులు గారపాటి పద్మజావాణి, రత్నాకర్ రావు పాల్గొన్నారు.


చిన్నారితో రెడ్‌క్రాస్ సిబ్బంది

విద్యార్థుల్లో ప్రతిభకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం

భీమడోలు : విద్యార్థుల్లో ని బిడీకృతమై ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు సహకరిస్తాయని భీమడోలు మండల విద్యాధికారి నెంబర్-1 శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు హై స్కూల్ వేదికగా మండలస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన 2023-24 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంధానకర్తగా ఉపాధ్యాయుల మండే సుధాకర్ వ్యవహరించారు. ప్రదర్శనలలో భీమడోలు మండల పరిధిలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, రెండు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, బిఆర్.అంబేద్కర్ గురుకులం పొలసానిపల్లికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. 45 అంశాలపై విద్యార్థులు తయారుచేసిన పలు అంశాలను ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్నింటిని ఉపాధ్యాయులు తయారు చేశారు. న్యాయ నిర్ణేతలుగా మండల విద్యాధికారితో పాటు భీమడోలు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాసరావు, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు పవన్‌కుమార్ పాల్గొన్నారు. ప్రదర్శనలో ఏడు సబ్జెక్టులకు చెందిన అంశాలను ప్రదర్శించారు. వీటినుంచే టీచర్ ఎగ్జిబిట్, విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్, విద్యార్థుల గ్రూప్ ఎగ్జిబిట్ అంశాల వారీగా మండల స్థాయి విజేతలను ఎంపిక చేశారు. వీరు జిల్లాస్థాయి ప్రదర్శనలకు హాజరు కావలసి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రదర్శన విజేతలుగా నిలిచిన భీమడోలు హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఎండి హసీనా బేగం తయారుచేసిన రొటేషనల్ కెమిస్ట్రీ, గుండుగొలను హైస్కూల్ ఉపాధ్యాయురాలు ఎల్.రమాదేవి తయారు చేసిన ఔషధ మొక్కల ఉపయోగాలు అంశాలు ప్రథమ, ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. విద్యార్థుల వ్యక్తిగత ఎగ్జిబిట్ ప్రదర్శన ఆగడాలలంక హై స్కూల్‌కి చెందిన విద్యార్థి తయారు చేయగా బ్రౌత్ అనలైజర్ ప్రథమ స్థానాన్ని దక్కించుకుంది. విద్యార్థుల గ్రూప్ ఎగ్జిబిట్‌లో గుండుగొలను హైస్కూల్ విద్యార్థులు బి.రాజేష్, జి.హర్షిత తయారు చేసిన సేంద్రియ వ్యవసాయ విధానం ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. విజేతలకు భీమడోలు హైస్కూల్లో గురువారం నిర్వహించే కార్యక్రమానికి హాజరుకానున్న ఎంఎల్ఎ వాసుబాబు చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సొసైటీ నిధులతో గ్రంథాలయం ఆధునికీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

పుస్తక పఠనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. చేబ్రోలు విశాల సహకార సంఘం (నారాయణపురం సొసైటీ) ఇచ్చిన రూ.2 లక్షలతో నారాయణపురం శ్రీఅరవింద ప్రభుత్వ డిగ్రీ కాలేజి గ్రంథాలయం ఆధునీకీకరణ, డిజిటలైజేషన్ కోసం సొసైటీ తరపున త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి, డైరెక్టర్లు దాసరి సత్యనారాయణ, సూరే ఏడుకొండలు ఇచ్చిన గ్రాంటుతో విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. బుధవారం ఎంఎల్ఎ వాసుబాబు గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో గ్రంథాలయంలో 4 వేల పుస్తకాలు ఉండగా సొసైటీ సహకారంతో 7 వేల పుస్తకాలను సమకూర్చామన్నారు. ఒకేసారి 75 మంది విద్యార్థులు రీడింగ్ చేసేలా టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సొసైటీ ఛైర్‌పర్సన్ బాబ్జి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఎఎంసి ఛైర్మన్ మరడ రమావతి, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

విద్యార్థుల్లో సృజనాత్మకతకు సైన్స్ ఫెయిర్ దోహదం

ట్రెయినీ కలెక్టర్ శ్రీపూజ

సైన్స్‌ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందని ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ అన్నారు. బుధవారం మండలంలోని హైస్కూల్‌లో మండలస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా వచ్చిన ట్రైనీ కలెక్టర్ పూజా ప్రారంభించారు. పర్యావరణ, భూమి వెడెక్కడానికి గల కారణాలు, ఆరోగ్య భద్రత, వంటి కార్యక్రమాలపైన విద్యార్థులచే ప్రయోగాలు ప్రదర్శించారు. మండలంలోని చెక్కపల్లి హైస్కూల్‌కి, జీవామృతం ప్రయోగానికి మొదటి బహుమతి సాధించగా, చింతలవల్లి గురుకుల పాఠశాలకు ఆరోగ్య భద్రతపై రెండవ బహుమతి వచ్చింది. ముసునూరు హైస్కూల్ మూడవ బహుమతి పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్నత విలువలు పాటించి, దేశానికి గొప్ప సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, వాణి కుమారి, చిట్టిబాబు, శివ నాగమణి పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో బాలోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలోత్సవాలను స్థానిక సురేష్ చంద్ర బహుగుణ(పోలీస్) స్కూల్‌లో ఈనెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆహ్వానసంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు తెలిపారు. హేలాపురి బాలోత్సవం 4వ పిల్లల సంబరాలకు సంబంధించి స్థానిక అన్నే భవన్‌లో బాలోత్సవ కమిటీ బుధవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అకడమిక్, కల్చరల్ విభాగాల్లో సుమారుగా 69 అంశాల్లో ప్రతిభా పాటవాలు ప్రదర్శించే అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. నగరంలోని పెద్దలు చాలా మంది నిర్వహణలో భాగస్వాములైనారని తెలియజేశారు. వేమన పద్యాల పుస్తకం, స్కూల్స్‌కు అందజేసే సావిత్రి బాయి పూలే చిత్ర పటాల ఆవిష్కరణ కార్యక్రమం, వెయ్యి మందికి పైగా విద్యార్థులతో చదవాలిరా ఎన్ని ఆటంకాలు వచ్చినా పాట సామూహిక ఆలాపన ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హేలాపురి బాలోత్సవం నమోదు చేస్తున్నామని వివరించారు. ఆహ్వాన సంఘం గౌరవ సలహాదారులు ఎంఎస్.కుమార్ మాట్లాడుతూ ఏలూరులోని, చుట్టు పక్కల ప్రాంతాల స్కూల్ విద్యార్థులకు అవకాశం కల్పించామని చెప్పారు. కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ సాబ్జి స్మారక ప్రాంగణంగా బాలోత్సవ ప్రాంగణానికి పేరు పెడుతున్నామని ప్రకటించారు. జిల్లా విద్యా శాఖ అధికారి పి.శ్యామ్ సుందర్, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఐ.వేంకటేశ్వర రావు, నెక్స్‌జెన్ ఫీడ్స్ ఎండి.అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, ఇతర ప్రభుత్వ అధికారులు బాలోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ప్రెస్‌మీట్‌లో పిన్నాక అంజనేయులు, వి.సురేష్, ఎం.అజయ్ బాబు, జి.శారద, కె.శ్రావణీకుమారి, పి.అదిశేషులు పాల్గొన్నారు.

తాడువాయిలో తాగునీటికి కటకట

రోడ్డుపై ఖాళీ బిందెలతో నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయి ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్వాసితులు తాగునీటి కష్టాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం టేకురు కాలనీకి నిర్వాసితులు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ రోడ్డుపై ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. టేకూరు కాలనీలో పైపులైన్లు లేకపోవడంతో నీళ్లట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా జరిగేది. గత వారం రోజుల నుంచి ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో నిర్వాసితులు కాంట్రాక్టర్లను నిలదీయగా తమకు బిల్లులు రావడం లేదని నేటి సరఫరా నిలిపివేసినట్లు బదులిచ్చారని నిర్వాసితులు వాపోతున్నారు. అలాగే మీకు దిక్కున చోట చెప్పుకోవాలని నిర్వాసితులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. దీంతో తాగునీటి కోసం ఖాళీ బిందెలు, బకెట్లతో నిర్వాసితులు కాలనీ రోడ్లపై నిరసన తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న నిర్వాసితులు

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు

కొయ్యలగూడెం : తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అనేక సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని రాజవరం గ్రామంలో ఉచిత కుట్టు శిక్షణా కేంద్రం ఏర్పాటు చేసి 90 రోజులైన సందర్భంగా ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మహిళలు ఈ ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొంది వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి ఆర్థిక పురోగతి సాధించాలని సీతారామాంజనేయ చౌదరి కోరారని మండల సేవా ప్రతినిధులు ఆరేటి యేసుబాబు, మూసిరెడ్డి కావ్య నాగశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాబత్తుల గంగరాజు, మండల ఉపాధ్యక్షులు కోన రామకృష్ణ పాల్గొన్నారు.

నిర్మాణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సందర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణంలో రూ.25 కోట్లతో నిర్మాణంలో ఉన్న నూతన భవనాన్ని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి నూతన భవనంలోకి కావలసిన వైద్య పరికరాలు, ఇతర సామాగ్రి, ఐసియు , బెడ్ల ఏర్పాట్లు మిగతా అవసరాలపై చర్చించి చీఫ్ ఇంజనీర్‌కు వివరాలు తెలియపరుస్తామన్నారు. త్వరలోనే అన్నిటినీ సమకూరుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిన్టెంట్ నరేంద్రసింగ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు కూరగాయల వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పరిసర ప్రాంతాలైన దేవరగుంట, జంగం గూడెం, రావిచెర్ల, వెంకటాయపాలెం తదితర గ్రామాల నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంకి, శ్రీశైలం దేవస్థానానికి అన్నదాన కార్యక్రమాలకు బుధవారం కూరగాయలను రైతులు వితరణగా అందించారు. ఈ సందర్భంగా రాము అనే రైతు మాట్లాడుతూ నక్క సత్యనారాయణ ఆధ్వర్యంలో రైతులు, దాతల సహకారంతో తిరుమల తిరుపతికి 12 టన్నులు, శ్రీశైలం దేవస్థానానికి 3 టన్నుల కూరగాయలను పంపుతున్నట్లు తెలిపారు. ప్రతినెలా ఇదేవిధంగా కూరగాయలను పంపుతున్నామన్నారు. దేవస్థానం వారికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

చిన్న వెంకన్న ఆలయంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

ద్వారకా తిరుమల : శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమలలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 22వ తేదీ శుక్రవారం స్వామివారి గిరిప్రదక్షిణ, 23వ తేదీ శనివారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా చిన్నవెంకన్న ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాట్లు చేశారు. సర్వదర్శనం, రూ.100, రూ.200, రూ.500 టికెట్లకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామని ఆలయ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నాయని, శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారంలో దర్శనమిస్తారన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి వేంద్ర త్రినాథరావు తెలిపారు.

రైతులకు ఉచితంగా పశువుల మందుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడి గ్రామంలో జిల్లా ఉచిత సేవా సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా పశువులకు అందించే మందులు, దాణా బుధవారం జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజనాయన చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పేరం కృష్ణ యాదవ్, వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు బి.నరసింహారావు, సచివాలయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

రైతుల జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మిచౌంగ్ తుపాను కారణంగా మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచడం జరిగిందని మండల తహశీల్దారు కె.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బి.వేణుమాధవ్ బుధవారం తెలిపారు. రైతులందరూ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ లోపు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని రైతులను కోరారు. మండలం మొత్తం మీద 24 రెవెన్యూ గ్రామాలలో 5,733 ఎకరాల్లో 3,938 మంది రైతులకు పంటనష్టం జరిగినట్లు నివేదికలు సమర్పించడం జరిగిందన్నారు.

'బిసిలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి'

ఏలూరు టౌన్ : జనాభా దామాషా ప్రకారం బిసిలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు, వైసిపి జిల్లా కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం పిలుపు మేరకు బిసిలకు రాజ్యాధికారం కావాలంటూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రథయాత్ర బుధవారం ఏలూరు చేరుకుంది. పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంలో మెయిన్ బజార్ మీదుగా రథయాత్ర సాగి జూట్‌మిల్ సెంటర్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద జరిగిన సభలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ వై.నాగేశ్వరరావు, జాతీయ మహిళా అధ్యక్షురాలు వై.నూకానమ్మ, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోల శ్రీలక్ష్మి, ఈడ ఛైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎపి ఫైర్ అండ్ డిజాస్టర్ డిజిపి పివి.సునీల్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎన్‌విఎన్ కాలనీ సుప్రింపేట డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠాశాలలో విద్యార్థులకు, యువతకు క్రీడా కిట్లు అందజేశారు. అనంతరం ఎన్‌విఎన్ కాలనీ వద్ద సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లాలన్నారు.